www.prajasakti.com
ప్రజాశక్తి
శుక్రవారం 15 డిసెంబర్ 2023
5
వైఎస్ఆర్



కోదండరాముడి సేవలో హైకోర్టు జడ్జి

ప్రజాశక్తి - ఒంటిమిట్ట



హైకోర్టు జడ్జికి స్వాగతం పలుకుతున్న అర్చకులు

రాష్ట్ర లోక్ అదాలత్ చైర్మన్, హైకోర్టు జడ్జి భవిత గురువారం ఒంటిమిట్ట శ్రీకోదండ రామాలయాన్ని సందర్శించారు. ఆమెకు ఆలయ అర్చకులు టిటిడి అధికారులు, వేదపండితులు పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. సీతారామలక్ష్మణ స్వాముల వారి దగ్గర ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ నిర్వాహకులు ఆమెను శాలువా కప్పి సత్కరించారు. ఆలయ విశిష్ట గురించి వివరించారు. కార్యక్రమంలో టిటిడి అధికారులు, వేద పండితులు, ఆలయ అర్చకులు పోలీసులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు,



ముద్దనూరు : కళ్లకు గంతలు కట్టుకుని మోకాళ్లపై నిల్చుని నిరసన తెలియజేస్తున్న అంగన్వాడీలు



బ్రహ్మంగారిమఠం : అంగన్వాడీ కేంద్రం తాళాలను గొడ్డలితో పగలగొడుతున్న సిబ్బంది

సమస్యలు పరిష్కరించే వరకూ వెనకాడబోం

- మూడవ రోజు కొనసాగిన సమ్మె
- పలు చోట్ల అంగన్వాడీ కేంద్రాల తాళాలు ధ్వంసం
- మోకాళ్లపై కూర్చుని, కళ్లకు గంతలు కట్టుకుని నిరసన
- అధికారుల వైఖరిని వ్యతిరేకిస్తూ పోలీస్‌స్టేషన్‌లో అంగన్వాడీల ఫిర్యాదు
- పార్టీలు, ప్రజల నుంచి పెరుగుతున్న మద్దతు

సమస్యలు పరిష్కరించే వరకూ వెనకడుగు వేయబోం తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలంటూ వైఎస్ఆర్ జిల్లాలో అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు చేపట్టిన నిరవధిక సమ్మె గురువారం నాటికి మూడో రోజుకు చేరుకుంది. జిల్లా వ్యాప్తంగా ఉన్న ఐసిడిఎస్, తహశీల్దార్, ఎంపిడిఒ కార్యాలయాల ఎదుట అంగన్వాడీలు పెద్ద ఎత్తున ఆందోళనలు చేపట్టారు. ప్రభుత్వం సమ్మెను నిర్వీర్యం చేసేందుకు రకరకాల ఎత్తు గడలకు పాల్పడుతోంది. కేంద్రాలకు తాళాలు పగల గొట్టించడం, సచివాలయ సిబ్బందికి బాధ్యతలు అప్పగించడం వంటి చర్యలకు పూను కుంటోంది. అంగన్వాడీలు మాత్రం సమస్యలు పరిష్కారమయ్యే వరకూ సమ్మె విరమించేది లేదంటూ నినాదాలు చేశారు. కళ్లకు గంతలు కట్టుకుని మోకాళ్లపై కూర్చొని నిరసన తెలియజేశారు. బొబ్బిలి ఎమ్మెల్యే అంగన్వాడీల ఆందోళనపై చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ పోరుమామిళ్లలో ఆయన దిష్టిబొమ్మను దహనం చేశారు. అంగన్వాడీ కేంద్రాల తాళాలు అధికారులు పగలగొట్టడాన్ని నిరసిస్తూ ప్రొద్దుటూరు రూరల్ పోలీస్‌స్టేషన్‌లో అంగన్వాడీ కార్యకర్తలు ఫిర్యాదు చేశారు. అంగన్వాడీల సమ్మెకు సిఐటియు, ఎఐటియుసి, ఐఎఫ్‌టియులతో పాటు సిపిఎం, తెలుగుదేశం, కాంగ్రెస్, జనసేన పార్టీలకు చెందిన నాయకులు సంపూర్ణ మద్దతు తెలియ జేశారు. వారి మద్దతుతో అంగన్వాడీల సమ్మె మరింత ఉధృత రూపం దాల్చుతోంది. కార్యకర్తలు, ఆయాలు ఎక్కడికక్కడ కార్యాలయాల ఎదుట బైటాయించి నిరసన వ్యక్తం చేశారు.



పోరుమామిళ్ల : బొబ్బిలి ఎమ్మెల్యే దిష్టిబొమ్మను దహనం చేస్తున్న అంగన్వాడీ కార్యకర్తలు

ప్రొద్దుటూరు(పుట్టపర్తి సర్కిల్) : మండలంలోని అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు గురు వారం ప్రొద్దుటూరు రూరల్ సిడిపిఒ కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. అంగన్వాడీ సమ్మెకు మాజీ ఎమ్మెల్యే వరద రాజులరెడ్డి సంఘీభావంగా సమ్మెలో పాల్గొన్నారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు సత్యనారాయణ సమ్మెను ద్దేశించి మాట్లాడారు. **పోలీస్ స్టేషన్ వద్ద నిరసన, ఫిర్యాదు...** అంగన్వాడీ కేంద్రాల తాళాల పగలగొట్టి తెరవాలని, సచివాలయ సిబ్బందికి, వాలంటీర్లకు ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చింది. దీంతో రాజుపాలెం, ప్రొద్దుటూరు మండలాల్లో అంగన్వాడీ కేంద్రాల తాళాలను పగలగొట్టి తెరిచారు. ఇలాంటి దుర్మార్గమైన ఆలోచనలు మానుకోవాలన్నారు. దీంతో ఆగ్రహించిన అంగన్వాడీ కార్యకర్తలు రూరల్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద నిరసన తెలి యజేశారు. అక్కడి నుంచి ర్యాలీగా వెళ్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో ఐద్వా మహిళా సంఘం జిల్లా కార్యదర్శి ముంతాజ్, సిఐటి నాయకులు విజయకుమార్ సాల్మన్ పాల్గొన్నారు. **పోరుమామిళ్ల :** రాష్ట్రంలో లక్ష మంది అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ మినీ వర్కర్స్ ఉన్నారని అలాంటి వారి పైన బొబ్బిలి ఎమ్మెల్యే దుర్మార్గంగా అనుచితమైన వ్యాఖ్యలు చేయడం ప్రభుత్వానికి నష్టదాయకమని ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి లక్ష్మీదేవి, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు యన్ భైరవప్రసాద్ పేర్కొన్నారు. గురువారం ఉదయం పట్టణంలోని ఐసిడిఎస్ కార్యాలయం ముందు బొబ్బిలి ఎమ్మెల్యే అంగన్వాడీ టీచర్ల పైన ఒళ్ళు బలిసి సమ్మె చేస్తున్నారా, అనే అనుచితమైన వ్యాఖ్యలపైన ఎమ్మెల్యే దిష్టిబొమ్మ దగ్ధం చేశారు. అనంతరం మోకాళ్లపై నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే ఇంట్లో మహిళలు ఉన్నారని, అంగన్వాడీ టీచర్లు కూడా మహిళలే అని అన్నారు అంగన్వాడీ టీచర్లకు తమ న్యాయమైన డిమాండ్లు అడుగుతుంటే అనుచిత వ్యాఖ్యలు చేయడం దారుణమని వాపోయారు. వెంటనే ఎమ్మెల్యే తన అనుచిత వ్యాఖ్యలను వెనక్కి తీసుకోకపోతే ఆయన ఇంటి ముందు ధర్నా చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు ఓబులాపురం విజయమ్మ, దస్తగిరిమ్మ, జ్యోతమ్మ ,రేణుకమ్మ, లక్ష్మీదేవి, వందల మంది అంగన్వాడి టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు. **వేంపల్లె:** రాబోవు ఎన్నికల్లో ఓటు అనే అయుధంతో అంగన్వాడీలను ద్రోహం చేస్తున్న వైసిపి ప్రభుత్వాన్ని ఇంటికి తరిమి కొట్టాలని టిడిపి మండల కన్వీనర్ రామమునిరెడ్డి అన్నారు. గురువారం అంగన్వాడీ కార్యకర్తలు నిర్వహిస్తున్న సార్వత్రిక సమ్మెకు టిడిపి, ఎస్‌టియులతో పాటు,. వామపక్ష పార్టీలు సంఘీభావం తెలియజేశారు. అంగన్వాడీలతో కలిసి మోకాళ్లపై నిలబడి వైసిపి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఎస్‌టియు నాయకులు సంఘమేశ్వరరెడ్డి, నరసింహారెడ్డి, రాజశేఖర్, టిడిపి నాయకులు నిమ్మకాయల మహమ్మద్ దర్బార్, డివి సుబ్బారెడ్డి, గోగుల మల్లికార్జున, బాలకృష్ణారెడ్డి, వేమ నారాయణ, మహబూబ్ షరీఫ్, ఈశ్వరయ్య, మహమ్మద్ ఇనాయతుల్లా, వెంకటయ్య, మడక శ్రీనివాసులు, రామాంజనేయురెడ్డి (చంటి) , గొగుల మారుతి, వెల్డింగ్ బాష, పోతిరెడ్డి శివ, సిపిఐ ఏరియా కార్యదర్శి బ్రహ్మంతో పాటు సిఐటియు, ఎఐటియుసి నాయకులు పాల్గొన్నారు. **ముద్దనూరు :** అంగన్వాడీలు స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట చేపట్టిన సమ్మె గురువారం మూడో రోజుకు చేరింది. అంగన్వాడీ కార్యకర్తలు కళ్లకు నల్లగుడ్డతో గంతలు కట్టుకుని మోకాళ్లపై నిల్చుని నిరసన వ్యక్తం చేశారు. తమ డిమాండ్లు పరిష్కరించాలని కార్యకర్తలు అంగన్వాడీ కేంద్రాలకు తాళాలు వేసి సమ్మె చేపట్టారు. తాళాలు పగులకొట్టి కేంద్రాలు తెరవాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేశారు. దీంతో సచివాల కార్యదర్శి, సిబ్బంది మండలంలోని అన్ని కేంద్రాల తాళాలు పగులగొట్టారు. అనంతరం స్వయం సహాయక సంఘాల సభ్యులకు నిర్వాహణ బాధ్యతలు అప్పగించారు. **దువ్వూరు :** అంగన్వాడీ కార్మికులు స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట మూడో రోజు వినూత్నంగా మోకాళ్లపై నిల్చుని నిరసన తెలియజేశారు. అక్కడికి అంగన్వాడీ కార్యకర్త తన చంటి పాపతో వచ్చి ఆందోళనలో పాల్గొన్నారు. పాప వెక్కివెక్కి ఏడుస్తుంటే పక్కనే ఉన్న చెట్టుకు ఊయల కట్టి జోల పాడి నిద్రపుచ్చిచ్చారు. **బద్వేలు :** స్థానిక సిడిపిఒ కార్యాలయం వద్ద గురువారం అంగన్వాడీ సమస్యలు పరిష్కరించాలని అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) బద్వేల్ ప్రాజెక్టు కమిటీ ఆధ్వర్యంలో ప్ల కార్డులతో మోకాళ్లపై నిలబడి తమ నిరసనను తెలియజేశారు. అంగన్వాడీల నిరసనకు ఆయా ప్రజా సంఘాల నాయకులు మద్దతు తెలియేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాసులు, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి. లక్ష్మీదేవి, అంగన్వాడీ యూనియన్ గౌరవ అధ్యక్షురాలు కె. సుభాషిని ప్రధాన కార్యదర్శి ఆర్. హుస్సేనమ్మ, ప్రాజెక్టు నాయకురాళ్లు సత్యవతి, కళావతి, విజయమ్మ, తులసమ్మ, వెంకట నరసమ్మ, వసంతమ్మ, శ్రీలత, లీలావతి, కళావతి, కృష్ణవేణి, ప్రవీణ, ఉమాదేవి, లక్ష్మీ నరసమ్మ, మహాలక్ష్మి ప్రాజెక్టు పరిధిలోని అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. **కడప అర్బన్ :** అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ అంగన్‌వాడి కార్యకర్తలు, ఆయాలు చేపట్టిన సమ్మె గురువారం నాటికి 3వ రోజుకు చేరుకుంది. మోకాళ్లపై కూర్చొని వినూత్న రీతిలో నిరసన తెలిపారు. సచివాలయ సిబ్బంది సెంటర్లు తెరవాలంటూ కొన్ని చోట్ల కార్యకర్తలపై ఒత్తిడి తీసుకువచ్చారు. భగత్‌సింగ్ నగర్, ఆర్.కె.నగర్, బాలాజీనగర్‌లో సెంటర్ల బీగాలు పగులగొట్టిన సంఘటనలు చోటుచేసుకున్నాయి. కార్యకర్తలు, ఆయాలు లేకుండా అంగన్‌వాడీ సెంటర్లు తెరిస్తే అక్కడ ఉన్న గుడ్లు, సరుకులకు లెక్కలు ఎలా అనే సందేహాన్ని ప్రజలు వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం సమ్మెకు విచ్ఛిన్నం చేయడానికి శతవిధాల ప్రయత్నిస్తుంది. సిడిపిఒలు, సూపర్‌వైజర్లపై తీవ్రమైన ఒత్తి తీసుకువస్తున్నారు. ఇచ్చిన హామీలు అమలు చేసేవరకు సమ్మె విరమించేది లేదని స్పష్టం చేస్తున్నారు. కార్యక్ర మంలో సిపిఎం జిల్లా కార్యదర్శి జి. చంద్రశేఖర్; సిఐటియు నగర ప్రధాన కార్యదర్శి వెంకటసుబ్బయ్య, ఎపి మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ నగర అధ్యక్షులు సుంకర రవి, నాయకులు ఓబులేసు, ఎపి అంగన్‌వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు అంజనీదేవి, కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు. **బి. కోడూరు :** మండలంలో అంగన్వాడీ వర్కర్లు మూడురోజుల నుంచి నిరవధిక సమ్మె నిర్వహిస్తున్నారు. అంగన్వాడీ పాఠశాలలో రోజూ పౌష్టికాహారం అందించే బాధ్యతలను ప్రభుత్వం గ్రామ సచివాలయం, సెర్ప్ సిబ్బందికి అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. అంగన్వాడీ సిబ్బంది తిరిగి విధుల్లోకి వచ్చేవరకూ సచివాలయ సిబ్బంది అంగన్వాడీ పాఠశాలల్లో విధులు నిర్వహించాలని ఎంపిడిఒ భాస్కర్‌రావు ఆదేశాలు జారీ చేశారు. **మైదుకూరు :** రాష్ట్ర వ్యాప్త నిరవధిక సమ్మెలో భాగంగా గురువారం మైదుకూరు సిడిపిఓ కార్యాలయం వద్ద అంగన్వాడీ కార్యకర్తలు మోకాళ్లపై కూర్చొని నిరసన తెలియజేశారు. వారి సమ్మెకు ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు రాహుల్, సిఐటియు నాయకులు జహింగీర్‌బాదష హాజరై సంఘీభావం ప్రకటించారు. కార్యక్రమంలో సిఐటియు మండల అధ్యక్ష, కార్యదర్శులు ధనలక్ష్మి, వెంకటసుబ్బమ్మ, కార్మికులు వేదమ్మ, లతా, లక్ష్మీదేవి పాల్గొన్నారు. **సింహాద్రిపురం :** తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలంటూ అంగన్వాడీలు కేంద్రాలకు తాళాలు వేసి నిరసన తెలుపుతున్నారు. అంగన్వాడీ కేంద్రాలను అధికారులు స్వాధీనం చేసుకుని వాటి తాళాలు పగులగొడుతున్నారు. అధికారుల చర్యల పట్ల అంగన్వాడి కార్యకర్తలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని గురజాల, ఇందిరానగర్‌తో పాటు పలు కేంద్రాల వద్దకు పంచాయతీ సిబ్బంది వెళ్లి తాళాలు పగలగొట్టి అంగన్వాడి కేంద్రాన్ని తెరిచారు. శుక్రవారం నుంచి పూర్తి స్థాయిలో అంగన్వాడీ కేంద్రాలను తెరిచేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఎంపిడిఒ కృష్ణమూర్తి తెలిపారు. **చింతకొమ్మదిన్నె :** అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు సమ్మె నిరవధిక సమ్మె నిర్వహిస్తున్న నేపథ్యంలో మహిళా పోలీస్ చిన్నమ్మ, పంచాయతీ కార్యదర్శి పావని, విఆర్ఒ ప్రతాపరెడ్డి, విఆర్ఒలు అంగన్వాడీ కేంద్రాల తాళాలను పగలగొట్టారు. తలుపులు తెరచి అక్కడ ఉన్న స్టాకును పరిశీలించారు. **బ్రహ్మంగారిమఠం :** ఎపి అంగన్వాడీ వర్కర్స్ హెల్పర్స్ సిఐటియు అనుబంధం అంగన్వాడీ సమ్మె మూడవ రోజు రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా మోకాళ్లపై కూర్చుని నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో అనురాధ, మంజుల, లత, అన్నపూర్ణ, పద్మ, సరదా, రాణి, చెన్న కృష్ణమ్మ, సిఐటియు నాయకులు భాస్కర్ పాల్గొన్నారు.



పులివెందుల : ఆందోళనకు మద్దతునిస్తున్న బిటెక్ రవి



బద్వేల్ : ఆందోళన చేస్తున్న అంగన్వాడీలు

అటు ఆందోళన.. ఇటు ఆలన



దువ్వూరు : తన బిడ్డను చెట్టుకు ఊయలకట్టి జోల పాడుతున్న అంగన్వాడీ కార్యకర్త

విద్యుత్‌ను పొదుపు చేయాలి : కలెక్టర్

ప్రజాశక్తి - కడప

భవిష్యత్తు తరాల కోసం ఇంధన భద్రత, ఇంధన పొదుపు ప్రతి ఒక్కరి భాధ్యత అని తెలియచేస్తూ ఈ నెల 14 నుంచి 20 వరకు నిర్వహిస్తున్న జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాలలో భాగంగా గురువారం కలెక్టర్ విజయ్ రామరాజు, మేయర్ సురేష్ బాబు, జిల్లా విద్యుత్ శాఖ అధికారి ఎస్. రమణ గోడపత్రాలు, కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం ఇంధన సామర్థ్యం, పరిరక్షణ ప్రాముఖ్యత, విద్యుత్ ఆదా గురుంచి ప్రజలలో అవగాహన కల్పించేదుకు కడప విద్యుత భవన్ నుంచి సంధ్య సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా విద్యుత్ శాఖ అధికారి ఎస్. రమణ మాట్లాడుతూ విద్యుత్ వాడకాన్ని ఆదా చేసేందుకు ఇంధన పరిరక్షణ చిట్కాలైన స్టార్ రేటెడ్ గృహ ఉపకరణాలు వాడటం, లైట్లు వాడకం లో జాగ్రత్తలు, ఎసిలు, ఫ్రిజ్‌లు, వాషింగ్ మిషన్ తదితర ఉపకరణాలు వాడకం గురుంచి తెలియచేసారు. విద్యుత్ ఆదా చేయడం వల్ల ఇంధన డిమాండ్ తగ్గి తద్వారా బొగ్గు, చమురు, గ్యాస్ వాడకం తగ్గి వాతావరణం లో కర్బన రసాయన కాలుష్యాలను తగ్గించవచ్చని తెలియజేశారు. భవిష్యత్‌లో భావి తరాల వారికి వెలుగులు అందిచడం కోసం ప్రతి ఒక్కరు బాధ్యతతో విద్యుత్ పొదుపు చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ టెక్నికల్ హరి సేవ్య నాయక్, విజిలెన్స్ ఇన్స్పెక్టర్ భాస్కర రెడ్డి, విద్యుత్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న కలెక్టర్, మేయర్, విద్యుత్ ఎస్ఇ

ఆశా వర్కర్లకు కనీస వేతనం ఇవ్వాలి : సిఐటియు



ధర్నాచేస్తున్న ఆశా వర్కర్లు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

ఆశా వర్కర్లకు రూ.26 వేల వేతనాలు, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని సిఐటియు జిల్లా కార్యదర్శి సత్యనారాయణ, విజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. గురువారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ఆశా వర్కర్లు ధర్నా చేశారు. వారికి మద్దతు తెలియజేస్తూ నాయకులు మాట్లాడారు. ఆశా వర్కర్లకు రాష్ట్ర ప్రభుత్వం రూ.10 వేలు ఇస్తున్నామని గొప్పలు చెప్పుకుంటుందని, వాస్తవానికి వారికి కేవలం రూ.6500 మాత్రమే వేతనాలు ఇస్తున్నారన్నారని చెప్పారు. రూ.3500 పని చేసే క్రమంలో కేసులకు ఇస్తున్నారన్నారు. సుప్రీంకోర్టు ఆర్డర్ ప్రకారం రూ.26 వేల వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆశాలకు సంక్షేమ పథకాలు కూడా రద్దు చేసి, పనిభారాన్ని పెంచారని వాపోయారు. ఉదయం 8 గంటలకు విధులకు వస్తే సాయంత్రం 5 వరకు పని చేయించుకుంటున్నారని పేర్కొన్నారు. వైసిపి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఆశా వర్కర్లపై విపరీతమైన వేధింపులు మొదలయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఆశా వర్కర్లు ఎవరైనా భర్త చనిపోయి విడో ఉంటే వారికి వితంతు పెన్షన్ రాకుండా ఆపుతున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు సాల్మన్, చంటి,మహిళా సంఘం జిల్లా కార్యదర్శి ముంతాజ్, భానుమతి,ఆశా వర్కర్స్ యూనియన్ కౌసల్య, రమాదేవి, సువర్మలేశ్వరి పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

విధి నిర్వహణలో వేగం పెరగాలి : విసి

ప్రజాశక్తి - కడప అర్బన్

శిక్షణలో పొందిన నైపుణ్యాలను వినియోగించుకుంటూ విధి నిర్వహణలో వేగం పెంచాలని యోగి వేమన విశ్వవిద్యాలయం విసి ఆచార్య చింతా సుధాకర్ అన్నారు. విశ్వవిద్యాలయంలో పనిచేస్తున్న బోధ నేతర సిబ్బందికి 'కంప్యూటర్ ప్రొఫిషియన్సీ స్కిల్స్' లో భాగంగా ఎమ్మెస్ ఆఫీస్ గురించి గత నెల 6 నుంచి కోర్సు డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో శిక్షణ ఇచ్చారు. గురువారం సాయంత్రం శిక్షణ ముగింపు సందర్భంగా జరిగిన సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. రోజూ విధుల్లో నైపుణ్యాలను ప్రదర్శించి కార్యాలయ పనులను నిర్ణీత సమయం కంటే ముందుగా పూర్తి చేసేందుకు కృషి చేయాలన్నారు. సాధన చేయాలని తద్వారా నేర్చుకున్న విషయాలను మర్చిపోకుండా ఉంటారని తెలిపారు. బోధ నేతర సిబ్బంది వారి వారి విధులకు సంబంధించి కోరిన శిక్షణను ఇచ్చేందుకు తాను ఎప్పుడూ సిద్ధంగా ఉంటానని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కోర్సు డైరెక్టర్‌ను, శిక్షణ నిపుణులను అభినందించారు. ప్రిన్సిపల్ ఎస్. రఘునాథరెడ్డి మాట్లాడుతూ నైపుణ్యత గుర్తింపును తెచ్చిపెడుతుందని, ఎప్పటికప్పుడూ నేర్చుకునేందుకు సంసిద్ధులుగా ఉండాలన్నారు. డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ శిక్షణ జరిగిన తీరును అధికారుల దృష్టికి తెచ్చారు. శిక్షణలో పాల్గొన్న వారికి సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. శిక్షణ నిపుణులు డాక్టర్ హనుమంత నాయక్, బోధ నేతర సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమ కేసులు పెడితే సహించం

ప్రజాశక్తి - కడప అర్బన్



మాట్లాడుతున్న డేవిడ్

పుంగనూరు నియోజకవర్గం ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రమచంద్రారెడ్డి అధికార అండ చూసుకుని పోలీసులు అధికారులు సాధారణ మహిళలు, ప్రజలు, రైతులపై అక్రమ కేసులు పెడితే చూస్తూ ఊరుకోమని బిసి యువజన పార్టీ రాష్ట్ర సమన్వయ సారధి పి.డేవిడ్ హెచ్చరించారు. గురువారం కడపలో మీడియాతో మాట్లాడారు. మహిళలు అని కూడా చూడకుండా రాత్రి 9 గంటల సమయంలో అరెస్టు చేసి, పోలీసు స్టేషన్‌లో నిర్బంధించడం ఏ రాజ్యాంగంలో ఉంది అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల కోసం, మహిళల కోసం, యువత కోసం తమ అధినేత రామచంద్ర యాదవ్ నేతత్వంలో బిసివై పార్టీ ఎంత వరకైనా పోరాటం చేస్తానని స్పష్టం చేశారు. అధికార పార్టీ నాయకులు పోలీసులని అడ్డం పెట్టుకుని సామాన్య ప్రజలపై కేసులు పెట్టించడం మంచి పద్ధతి కాదని పేర్కొన్నారు. అధికారం శాశ్వతంగా ఉండదని గుర్తు చేశారు.

'ప్రధాన కూడళ్లను అభివృద్ధి చేస్తే సరిపోదు'

ప్రజాశక్తి - కడప

నగర అభివృద్ధికి అఖిలపక్ష కమిటీ అభ్యంతరం తెలపదని, అభివృద్ధి పేరుతో నగరంలోని ప్రధాన రోడ్లు, సర్కిల్ బాగున్న వాటిని వచ్చినట్లు తవ్వి ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్నారని అఖిలపక్ష కమిటీ నాయకులు అన్నారు. నగరంలోని ప్రధాన రోడ్లు, కూడళ్ళు మాత్రమే అభివృద్ధి చేయడం సరిపోదని, ముందుగా మురికి వాడలను బాగు చేయాలని పేర్కొన్నారు. గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అఖిలపక్ష నాయకులు మాట్లాడారు. నగరంలో 250కిపైగా ఉన్న మురికి వాడలను ఏమాత్రమూ పట్టించుకోవడం లేదని వాపోయారు. పేదలు నివసించే ప్రాంతాల్లో రోడ్లు, డ్రెయినేజీ, తాగునీటి వసతి లేవని తెలిపారు. రాబోవు ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని కాంట్రాక్టర్లకు వరంగా అభివృద్ధి పేరుతో పనులు చేస్తున్నారని విమర్శించారు. అధికారులు అనాలోచిత నిర్ణయాల వల నగర పాలక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యాపారస్తుల పరిస్థితి అగమ్య గోచరంగా తయారైందన్నారు. వెంటనే నగర ప్రధాన రోడ్లు కూడళ్ల మాత్రమే కాకుండా పేదలు నివసించే ప్రాంతాల్లో కనీస మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎస్ఎ సత్తార్, హేతువాద సంఘం సిఆర్‌వి ప్రసాద్, దస్తగిరి, సిపిఐ (ఎం ఎల్), డబ్ల్యూ రాము, జాకీర్, మౌలానా పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్.ఎ.సత్తార్

వైసిపి ఆగడాలకు పరాకాష్ట : సిపిఎం

ప్రజాశక్తి- కడప అర్బన్

శాంతి భద్రతలు కాపాడే పోలీసులపైనే దాడులు చేయడం హేయనీయమని, వైసిపి ఆగడాలకు పరాకాష్టకు చేరుకుందని సిపిఎం జిల్లా కార్యదర్శి జి. చంద్రశేఖర్ పేర్కొన్నారు. గురువారం సిపిఎం కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి సొంత జిల్లాలో పోలీసులపై వైసిపి కార్యకర్తల దాడులు పోలీసుల మనోధైర్యాన్ని బలహీనపరిచే విధంగా ఉందని చెప్పారు. పోలీసులపై జరుగుతున్న వరుస దాడులు జిల్లాలోని సాధారణ ప్రజల్లో అభద్రతా భావాన్ని గురిచేస్తుందని తెలిపారు. దీనికి ముఖ్యమంత్రి బాధ్యత వహించాల్సి వస్తుందని హెచ్చరించారు. ప్రొద్దుటూరులో వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ మహిళా ఎస్‌ఐ హైమావతిపై దాడి, స్థానిక ఎమ్మెల్యే బామర్ది అనుచరులు చేశారని పత్రికల్లో, ప్రజల్లో చర్చ జరుగుతోందని, ఇంతవరకు స్థానిక ఎమ్మెల్యే ఎటువంటి ఖండన ఇవ్వలేదని పేర్కొన్నారు. కడప ఇంటెలిజెన్స్ డిపార్ట్‌మెంట్ సిఐ అనిల్ కుమార్ పై స్థానిక మయూరి హోటల్ యాజమాన్యం, అనుచరులు దాడి చేసి గాయపరిచారని, దీనిపైన వైసిపి శ్రేణులు ఇంతవరకు ఖండిస్తూ స్పందించలేదని తెలిపారు. ఇప్పటికైనా పోలీసులపై వైసిపి దాడులు ఖండించాలని, వారి అనుచరులను, వారి పార్టీ నుంచి బహిష్కరించాలని డిమాండ్ చేశారు. ఎస్ఐ సీఐ లపై దాడి చేసిన వారిని కాపాడే వారెవరో బహిరంగపరచాలని, వారిపై ఐపిసి 307 పెట్టి కఠినంగా శిక్షించాలని కోరారు. సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఏ. రామమోహన్ పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న అఖిలపక్ష నాయకులు

రైతులను ఆదుకోకపోతే ఆందోళన ఉధృతం

ప్రజాశక్తి - కడప అర్బన్

రాష్ట్ర వ్యాప్తంగా మిచౌంగ్ తుపాన్ వల్ల నష్టపోయిన రైతాంగాన్ని ప్రభుత్వం ఆదుకోకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని అఖిలపక్ష పార్టీలు, ప్రజా సంఘాల నాయకులు హెచ్చరించారు. గురువారం కలెక్టరేట్ ఎదుట ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి చంద్ర, జనసేన జిల్లా అధ్యక్షులు సుంకర శ్రీనివాసులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు ఎస్.ఎ.సత్తార్, సిపిఎం నగర కార్యదర్శి రామమోహన్ , తెలుగు రైతు సంఘం జిల్లా నాయకులు మల్లికార్జున, అవ్వారు మల్లిఖార్జున, ప్రతాప్‌రెడ్డి, కృష్ణ ప్రసంగించారు. రాష్ట్రంలో ఈశాన్య, నైరుతి రుతుపవనాలు దరి చేరక తగినంత వర్షాపాతం నమోదు కాలేదని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం 103 కరువు మండలాల జాబితాలో సిఎం సొంత జిల్లాలో ఒక్క మండలం కూడా కరువు జాజితాలో చేర్చకపోవడం బాధ్యరాహితమని విమర్శించారు. అనేకమంది నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రాల మరమ్మతులకు నిధులు మంజూరు

ప్రజాశక్తి-చెన్నూరు

మండలంలోని 55 అంగన్వాడీ కేంద్రాలకు గాను 34 అంగన్వాడీ కేంద్రాలకు నాడు-నేడు రెండో విడతలో మరమ్మతులు చేసేందుకు రూ.23,31,000 నిధులు మంజూరయ్యాయని మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు చీర్ల సురేష్ యాదవ్ తెలిపారు. గురువారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. వెంటనే బ్యాంకు ఖాతాలు ప్రారంభించి పనులు ప్రారంభించాలని ఐసిడిఎస్ అధికారులకు సూచించారు. ప్రతి గ్రామంలో మదర్స్ కమిటీలు వేయాలని, గ్రామ మదర్స్ కమిటీకి అంగన్వాడీ వర్కర్ చైర్మన్‌గా ఉంటారని, కమిటీ ఆధ్వర్యంలో పనులు జరుగుతాయని చెప్పారు. కార్యక్రమంలో చెన్నూరు మండల ఐసిడిఎస్ సూపర్ వైజర్లు నాగరత్నమ్మ, గుర్రమ్మ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపిపి చీర్ల సురేష్‌యాదవ్

ఆరోగ్యశ్రీని అపర సంజీవనిలా మార్చిన సిఎం

ప్రజాశక్తి - కడప

ఆరోగ్యశ్రీ పథకాన్ని ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి అపర సంజీవనిలా మార్చారని వైసిపి రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్ ఖాన్ అన్నారు. గురువారం తన కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ టిడిపి ప్రభుత్వం ఆరోగ్యశ్రీ పథకాన్ని నిర్వీర్యం చేసి అనారోగ్యశ్రీగా మార్చింది అన్నారు. ప్రయివేట్ ఆస్పత్రులకు బకాయిలు చెల్లించకుండా మోసం చేసిందన్నారు. 108, 104 వాహనాలకు డీజిల్ కూడా పోయకుండా మూలన పడేసారన్నారు. వైయస్ జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత రాష్ట్రవ్యాప్తంగా కొత్త వాహనాలను కొనుగోలు చేశారన్నారు. ఆరోగ్యశ్రీలో 3500 కు పైగా వ్యాధులను చేర్చి మేలు చేశారన్నారు. ఇందుకు ముఖ్యమంత్రికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

ఇంధన పొదుపుపై విద్యార్థుల ప్రతిజ్ఞ

కడప అర్బన్ : జాతీయ ఇంధన పొదుపు దినోత్సవం పురస్కరించుకుని గురువారం కెఎల్‌ఎం మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో విద్యార్థినులు ప్రతిజ్ఞ చేశారు. ప్రతి తరగతి గదికి వెళ్లి ఇందన పొందుపు గురించి వివరించారు. ప్లాకార్డులు చేతబూని రాబోయే తరాల కోసం ఇంధనం కాపాడుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.వి.రత్నమ్మ, అధ్యాపక, అధ్యాపకేతర బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.



సమ్మెకు మద్దతునిస్తున్న డేవిడ్‌రాజ్

సివిల్ సర్వెంట్లుగా గుర్తించాలి

- 3వ రోజు సమ్మెలో అదనపు పోస్టల్ సిబ్బంది

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

దేశవ్యాప్తంగా కొనసాగుతున్న గ్రామీణ తపాలా ఉద్యోగుల సమ్మెకు యస్‌పిఐ రాష్ట్ర సర్కిల్ సెక్రెటరీ డేవిడ్‌రాజ్ మద్దతునిచ్చారని అసిస్టెంట్ సెక్రెటరీ అజీమ్‌బాషా, మాజీ డివిజనల్ సెక్రెటరీ వి.సి వెంకటేశ్వరుడు తెలిపారు. స్థానిక తపాలా కార్యాలయం వద్ద చేస్తున్న సమ్మె గురువారం మూడోరోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఆందోళనకారులు మాట్లాడుతూ గ్రామీణ తపాల ఉద్యోగులకు కనీస వేతనాలు ఇవ్వాల్సిన అవసరాన్ని కేంద్ర ప్రభుత్వానికి ఉందన్నారు. కేంద్ర తపాలా వ్యవస్థ అభివృద్ధికి గ్రామీణ తపాలా ఉద్యోగులు అహర్నిశలు కృషి చేస్తున్నారని తెలిపారు. వారి సేవలు ఎల్లవేళలా తపాలా శాఖకు అత్యవసరమన్నారు. ఇప్పటికైనా తపాలా శాఖ వారి అవసరాలను గుర్తించి అవసరమైన సహాయం అందించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో డివిజనల్ సెక్రెటరీ ఆదినారాయణ, అసిస్టెంట్ సెక్రెటరీ శీను, జమ్మలమడుగు సబ్ డివిజన్ కింద పనిచేస్తున్న గ్రామీణ తపాలా ఉద్యోగులు పాల్గొన్నారు.

మైదుకూరు : తమను సివిల్ సర్వెంట్లుగా గుర్తించాలని అదనపు పోస్టల్ సిబ్బంది డిమాండ్ చేశారు. తమ డిమాండ్ల సాధనలో భాగంగా చేపట్టిన సమ్మె గురువారానికి మూడో రోజుకు చేరుకుంది. మైదుకూరు తపాలా కార్యాలయం వద్ద సిబ్బంది సమ్మె చేపట్టారు. కేంద్రం తమ డిమాండ్లను పరిష్కరించే వరకు తమ సమ్మె విరమించేదిలేదని తపాలా ఉద్యోగులు తెలిపారు. సమ్మెను తీవ్రస్థాయికి తీసుకువెళ్లామని వారు స్పష్టం చేశారు.

పింఛన్‌కు కరెంట్ బిల్లుతో ముడిపెట్టడం సరికాదు

- 33వ వార్డు కౌన్సిలర్ శివజ్యోతి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు



పేదరికాన్ని ప్రామాణికంగా తీసుకొని మంజూరు చేసే పింఛన్లను కరెంట్ బిల్లుతో ముడి పెట్టడం సరికాదని 33వ వార్డు కౌన్సిలర్ శివజ్యోతి తెలిపారు. ఆ మేరకు గురువారం ఆమె మాట్లాడుతూ అర్హులైన వృద్ధులు, వికలాంగులు, వితంతువులకు పింఛన్ కోసం దరఖాస్తు చేసుకోవాలంటే కరెంట్ బిల్లు కావాలని సచివాలయ సిబ్బంది చెప్పడం సరికాదన్నారు. రాష్ట్రంలో పలు రకాల సంచార జాతులు, భిక్షుక వృత్తి చేసుకునే వాళ్లు, వృద్ధాశ్రమంలో ఉన్నవాళ్లు కరెంటు మీటర్ సర్వీస్ నెంబర్లు ఎక్కడ నుంచి తెచ్చుకోవాలని ప్రశ్నించారు. జిల్లా ఉన్నతాధికారులు ఈ సమస్యను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. ఆధార్, రేషన్ కార్డు అర్హతగా తీసుకొని పింఛన్ మంజూరు చేయాలని శివజ్యోతి కోరారు.

టెక్స్‌టైల్ పార్కుకు రాజకీయ గ్రహణం

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

మైలవరం మండలంలో చేనేత ఆశాజనకమైన టెక్స్‌టైల్ పార్కు ప్రారంభానికి నోచుకోక శిథిలావస్థలో ఉన్న భవనాలు వెక్కిరిస్తున్నాయని ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు వీరనాల శివనారాయణ తెలిపారు. మైలవరంలో గురువారం చేనేతలతో కలిసి టెక్స్‌టైల్స్ పార్కును సందర్శించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా శివనారాయణ మాట్లాడుతూ ప్రభుత్వాలు మారుతున్నా టెక్స్‌టైల్ పార్కు భవిష్యత్ మాత్రం అలాగే ఉందన్నారు. పాలకులు, అధికారుల నిర్లక్ష్యంతోనే ఈ దుస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల హామీల్లో టెక్స్‌టైల్ పార్కు మేమొస్తే ఏర్పాటు చేస్తామని నాటి టిడిపి, నేటి వైసిపి హామీలిచ్చి అధికారంలోకి వచ్చాక మరిచాయన్నారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు లక్ష్మీనారాయణ, సహాయ కార్యదర్శి కొండయ్య, శివశంకర్, శేషయ్య, గోపాల్, నరసింహులు, గౌరీ కృష్ణ, సుబ్బరాయుడు, సంజీవ రాయుడు పాల్గొన్నారు.

ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

ఈనెల 18,19 తేదీల్లో జరిగే ఎస్ఎఫ్ఐ జిల్లా మహాసభను జయప్రదం చేయాలని పట్టణ కార్యదర్శి సురేష్ కోరారు. గురువారం సభల గోడపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం అధ్యయనం. పోరాటం నినాదంతో స్వాతంత్య్రం ప్రజాస్వామ్యం సోషలిజం లక్ష్యంగా 1970 డిసెంబర్‌లో ఎస్ఎఫ్ఐ ఆవిర్భవించిందన్నారు. అప్పటి నుండి ఇప్పటి వరకు విద్యార్థులను సంఘటితం చేస్తూ అనేక పోరాటాల్లో విజయం సొంతం చేసుకుందన్నారు. ఎస్ఎఫ్ఐ జిల్లా మహాసభలు ప్రొద్దుటూరు మండలంలో నిర్వహించనున్నామన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు విజయభాస్కర్, గురప్ప, సుబ్బయ్య పాల్గొన్నారు.

క్రైం కార్నర్

భార్యను హత్య చేసిన భర్త

ప్రజాశక్తి - పులివెందుల రూరల్



వసుంధర (ఫైల్‌ఫోటో)

పట్టణంలోని జెండామాను వీధిలో నివాసం ఉంటున్న బైరి వసుంధర(30) అలియాస్ జానకిని ఆమె భర్త బైరి బాలవాసు గురువారం హత్య చేశాడు. మృతురాలి తండ్రి ఈశ్వరయ్య వివరాల మేరకు.. 13ఏళ్ల క్రితం ప్రొద్దుటూరు డ్రైవర్ కాలనీలో నివాసముంటున్న కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న బాలవాసు అనే వ్యక్తికి వసుంధరను ఇచ్చి పెళ్లి చేశారు. కొన్నేళ్లుగా మద్యానికి బానిసై తమ కూతురును కొడుతూ.. కడపలో ఓ మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడని తెలిపారు. దీనిపై తాము పెద్ద మనుషులతో మాట్లాడి ఇక నుండి బాగా ఉంటూ వసుంధరను బాగా చూసుకోవాలని చెప్పామన్నారు. తమ బిడ్డ పులివెందులలో సంసారం పెట్టిందని, కానీ అతను మారలేదని తెలిపారు. మళ్లీ తాగుతూ కొడుతూ ఉండేవాడని పేర్కొన్నారు. గురువారం తమ బంధువులకు ఫోన్ చేసి గొంతు నులిమి చంపేసినట్లు సమాచారం రావడంతో వెంటనే పోలీసులతో సంఘటనాస్థలానికెళ్లామన్నారు. అక్కడ తమ బిడ్డ బాత్రూంలో చనిపోయి ఉందన్నారు. ఈ హత్యలో అతని కుటుంబ సభ్యుల ప్రోత్సాహం ఉంటుందని, తమకు న్యాయం జరిగేలా చూడాలని కోరాడు. వారికి ఒక కూతురు, కుమారుడు ఉన్నారని తెలిపాడు. సంఘనాస్థలాన్ని అర్బన్ సిఐ రాజు, ఎస్ఐ అరుణ్‌రెడ్డి పరిశీలించారు. వసుంధర తండ్రి ఫిర్యాదు మేరకు కేసు విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

జిఎన్‌ఎస్‌ఎస్ కాలువలో మృతదేహం లభ్యం

ప్రజాశక్తి - ముద్దనూరు

గండికోట జలాశయం ప్రాజెక్టు నుండి వామికొండకు వెళ్లే గాలేరు-నగరి సృజల స్రవంతి కాలువలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చంద్ర మోహన్ తెలిపారు. మృతునికి 35 ఏళ్లు ఉంటాయని శరీరంపై డ్రాయర్ మాత్రమే ఉందన్నారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి

ప్రజాశక్తి - చక్రాయపేట



ఉత్తన్న (ఫైల్‌ఫోటో)

విద్యుదాఘాతంతో కొండవాళ్లపల్లి గ్రామానికి చెందిన కేశనేని ఉత్తన్న మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి. కేశనేని ఉత్తన్న దినచర్యలో భాగంగా తన వ్యవసాయ పొలం వద్దకు మడి గెనెము మీద నడుస్తుండగా ట్రాన్స్‌ఫార్మర్ సమీపంలోకి వెళ్లే సరికి జారీ పడడంతో విద్యుదాఘాతానికి గురయ్యాడు. ఆర్కే వ్యాలీ పోలీసులు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నారు.

రైల్వే అండర్ బ్రిడ్జి కష్టాలు తీరేదెన్నడో..!

ప్రజాశక్తి - కమలాపురం

కమలాపురం మండల పరిధిలోని ఎర్రగుడిపాడు గ్రామంలో రైల్వే డబ్లింగ్ లైన్ వలన అండర్ బ్రిడ్జిని రైల్వే అధికారులు ఏర్పాటు చేశారు. రైల్వేగేట్ ఆ వైపు ఉన్నవారు, ఇటువైపు ఉన్నవారు రాకపోకలు సాగించాలంటే రైల్వే బ్రిడ్జి కింది నుంచి రావాలి. బ్రిడ్జి కింద ఊటలు ఎక్కువ కావడంతో నీరు నిలిచి రాకపోకలకు ఇబ్బంది కలుగుతోంది. ఈ దారి గుండా నిత్యం పాఠశాలకు వెళ్లే విద్యార్థులు, భారతి సిమెంట్, థర్మల్‌కు వెళ్లే కార్మికులు, వ్యాపారులు ఎర్రగుడిపాడులో ఉన్న అండర్ బ్రిడ్జి కింద నుండి వెళ్లాలి. దాదాపు రెండు మీటర్ల లోతులో నీళ్లు నిలిచాయి. ఈ దారి గుండా వెళ్లాలంటే విద్యార్థులు, ప్రజలు, వ్యాపారస్తులు, ఉద్యోగులు, మహిళలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షాలు వచ్చినప్పుడు నీళ్లు ఎక్కువగా నిలిస్తే.. విష పురుగులు కూడా ఈ నీటిలో సంచరిస్తుంటాయని పలువురు భయాందోళనలను వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలం వస్తే ఈ దారిలో ప్రయాణం చేయడం చాలా కష్టంగా ఉందని వాపోతున్నారు. రైల్వే అధికారులు స్పందించి ఇక్కడ నీళ్లు నిలవకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. నీటిని మోటర్ల ద్వారా బయటికి పంపిస్తారుకానీ సక్రమంగా పైపులలో పేరుకుపోయిన మట్టిని తొలగించడంలేదు. దీంతో నీరు ఎక్కువ నిలుస్తోందని, త్వరగా పైపుల్లో పేరుకుపోయిన మట్టిని తొలగించి, ఇక్కడ నీరు నిలవకుండా చూడాలని అధికారులను కోరుతున్నారు. ఇప్పటికైనా స్థానిక అధికారులు, రైల్వే అధికారులు, ప్రజాప్రతినిధులు అండర్ బ్రిడ్జి కింద ఫుట్‌పాత్‌ను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఫుట్‌పాత్ ఏర్పాటు చేస్తామని బ్రిడ్జి నిర్మించేటప్పుడు మాట ఇచ్చారని గుర్తు చేశారు. తక్షణమే సంబంధిత అధికారులు స్పందించకుంటే ఆందోళన చేస్తామని రైతులు, ఎస్‌సి, బిసి కాలనీల ప్రజలు హెచ్చరించారు.



బురద నీటిలో స్కూల్‌కు వెళ్లాలంటే ఇబ్బందిపడుతున్న విద్యార్థులు

'వ్యాపారుల పరిస్థితి దయనీయం'

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

ప్రొద్దుటూరులో వ్యాపారుల పరిస్థితి దయనీయంగా ఉందని టిడిపి ఇన్‌ఛార్జి డాక్టర్ జివి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. స్థానిక టిబి రోడ్డులోని తన కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో రెండవ ముంబైగా ప్రసిద్ధి చెందిన ప్రొద్దుటూరు ప్రముఖ వ్యాపార కేంద్రంగా ఉండేదన్నారు. కడప జిల్లా వాసి ముఖ్యమంత్రి అయినా కూడా వ్యాపారుల పరిస్థితి దయనీయంగా ఉందన్నారు. 40ఏళ్ల క్రితం నుండి ప్రస్తుత పరిస్థితులు లేవని వ్యాపారులు వాపోతున్నారన్నారు. ప్రొద్దుటూరులో ఎమ్మెల్యే రాచమల్లు వ్యాపారులపై కక్ష సాధింపు చర్యలు చేస్తున్నారన్నారు. రాచమల్లు ఆధ్వర్యంలో ఆదాయ పన్ను, జిఎస్‌టి దాడులు ఎక్కువ అయ్యాయన్నారు. ఎమ్మెల్యే కేవలం ఒక సామాజిక వర్గాన్ని టార్గెట్ చేస్తూ దాడులు చేయిసున్నారన్నారు. కార్పొరేట్ సంస్థలు ఇచ్చే డబ్బులకు ఆశపడి చిన్న,మధ్య తరగతి వ్యాపారుల కడుపు కొడుతున్నారన్నారు. ప్రొద్దుటూరు పట్టణంలో సిఎంఆర్ షాపింగ్ కాంప్లెక్స్ ఓపెనింగ్ సందర్భంగా సినీ తారలు వస్తే మైదుకూరు రోడ్డు బ్లాక్ చేశారన్నారు. నాలుగు గంటలు ట్రాఫిక్ నిలిచిపోయి, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారన్నారు. అధికార పార్టీ నాయకులకు ఒక రూల్, వ్యాపారులు, ప్రతిపక్ష నాయకులకు ఒక రూలా అని ప్రశ్నించారు. ఎమ్మెల్యే కుటుంబం ఎదుగుదల కోసం వ్యాపారులను బలి చేయొద్దని కోరారు. 2024 ఎన్నికల్లో టిడిపికి ఓటు వేసి తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే స్వేచ్ఛగా వ్యాపారాలు చేసుకునే సౌకర్యం కల్పిస్తూ.. శాంతి ప్రొద్దుటూరు నిర్మిం చేందుకు కృషి చేస్తానన్నారు.



మాట్లాడుతున్న జివి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి

సైన్స్ ప్రయోగాలతో ఉన్నత స్థాయికి



సైన్స్ ప్రయోగాలను తిలకిస్తున్న ఎంఇఒలు, ఉపాధ్యాయులు

ప్రజాశక్తి - చాపాడు

సైన్స్ ప్రయోగాలు చేయడం వల్ల విద్యార్థులు ఉన్నతస్థాయికి ఎదుగుతారని ఎంఇఒ రవిశంకర్ తెలిపారు. చాపాడు మండలస్థాయి సైన్స్ ఫెయిర్‌ను గురువారం గూడూరు అప్పయ్యగారి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఇఒ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు సైన్స్ ప్రయోగాలు రూపొందించాలన్నారు. కార్యక్రమంలో మండలంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

విజేతల వివరాలు.. విద్యార్థి విభాగంలో లక్ష్మీపేట పాఠశాలకు చెందిన 10వ తరగతి విద్యార్థి పి.వీరరాజేష్ గ్యాస్ లీకేజీ అయిన సందర్భంలో అలర్ట్ చేసే యంత్రాన్ని తయారు చేసి మెదటి స్థానంలో నిలిచాడు. గ్రూప్ విద్యార్థుల విభాగంలో నరహరిపురం పాఠశాల విద్యార్థులు నరసింహ భార్గవ్, విష్ణు వర్ధన్ మహిళల సంరక్షణ కోసం తయారు చేసిన ప్రయోగం ఎంపికైంది. ఉపాధ్యాయ విభాగం నుండి చాపాడు హైస్కూల్ ఉపాధ్యాయుడు బి.హరినాథ్ ఏర్పాటు చేసిన చంద్రయాన్-2 ప్రయోగం ఎంపికైంది. న్యాయ నిర్ణేతలుగా డిల్లీ పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపల్ రవీంద్రబాబు, ఎంఇఒ వి.వంశీకృష్ణ వ్యవహరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు గౌస్ మొద్దీన్, మండలంలోని సైన్స్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యుత్‌ను పొదుపుగా వినియోగించాలి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

మనిషి మనుగడకు అత్యంత అవసరమైన విద్యుత్‌ను పొదుపుగా వినియోగించుకోవాలని విద్యుత్‌శాఖ ఇఇ శ్రీనివాసులరెడ్డి అన్నారు. జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాల్లో భాగంగా రాష్ట్ర ఇంధన పరిరక్షణ మిషన్ రాష్ట్ర సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్ యాజమాన్యం ఆదేశాల మేరకు ఈనెల 14నుంచి 20వ తేదీ వరకు విద్యుత్ పొదుపు వారోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా గురువారం స్థానిక విద్యుత్ కార్యాలయం నుండి శివాలయం సర్కిల్ వరకు విద్యుత్ ఉద్యోగులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇఇ మాట్లాడుతూ వినియోగదారులు ఐఎస్ఐ స్టాండర్డ్స్ స్టార్‌రేటింగ్ కలిగిన విద్యుత్ ఉపకరణాలు మాత్రమే వాడాలన్నారు. అవసరం లేనప్పుడు లైట్లు, ఫ్యాన్లు ఆఫ్ చేయాలన్నారు. తప్పనిసరిగా కెపాసిటర్లు అమర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రొద్దుటూరు డివిజన్ డిఇఇలు, ఎఇలు, సిబ్బంది పాల్గొన్నారు.



ప్రొద్దుటూరులో ర్యాలీ చేస్తున్న విద్యుత్ ఉద్యోగులు

రాజకీయ సన్యాసానికి సిద్ధమా? :'అల్లం'



మాట్లాడుతున్న వైసిపి నాయకులు

ప్రజాశక్తి - కొండాపురం

బీటెక్ రవి రాజకీయ సన్యాసం సిద్ధమా.. అంటూ కొండాపురం మండలం వైసిపి జిల్లా ప్రచార కమిటీ కార్యదర్శి అల్లం సత్య సవాల్ విసిరారు. బుధవారం కొండాపురం పట్టణంలో జమ్మలమడుగు టిడిపి ఇన్‌ఛార్జి భూపేష్‌రెడ్డి బుధవారం పాదయాత్ర సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో వైసిపి నాయకులపై టిడిపి నాయకులు చేసిన అభియోగాలపై అల్లం సత్య స్పందిస్తూ.. గురువారం స్థానిక వైసిపి కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ గత పాలనలో టిడిపి కొండాపురానికి చేసిన అభివృద్ధి కంటే వైసిపి పాలనలోనే ప్రజలకు అనేక అభివృద్ధి పథకాలతోపాటు పునరావాస ప్యాకేజీ అందిందన్నారు. విద్యుత్ సబ్‌స్టేషన్‌లలో ఉద్యోగాలు అమ్ముకున్నారని అనడంలో వాస్తవంలేదన్నారు. బీటెక్ రవికి చిత్తశుద్ధి ఉంటే అందులో నిజానిజాలు నిరూపించాలన్నారు.కాణిపాకంలో వినాయకస్వామి ఆలయంలో ప్రమాణంచేయడానికి తమ ఎమ్మెల్యే మూలె సుదీర్‌రెడ్డి, మండల నాయకుడు చింత రాజారెడ్డి సిద్ధంగా ఉన్నారని తెలిపారు. అందుకు నీవు సిద్ధమా అని అడిగారు. నిరూపించలేకపోతే రాజకీయ సన్యాసం చేస్తావా అని సవాల్ విసిరారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ వెంగళ జగదీశ్వర్‌రెడ్డి, కొండు వినోద్‌కుమార్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, తిమ్మాపురం శేఖర్, మైనార్టీ కో-ఆప్షన్ మెంబర్ మహబూబ్ బాషా పాల్గొన్నారు.

'జీతాలకు బిల్లులు పెట్టలేదు'

ముద్దనూరు : డిసెంబర్ 14 దాటినా తహశీల్దార్ విఆర్‌ఏలకు జీతాలు బిల్లులు పెట్టలేదని వారు ఆర్డీఓ శ్రీనివాసులుకు విన్నవించుకున్నారు. గురువారం స్థానిక తహశీల్దార్ కార్యాలయానికి వచ్చిన ఆర్డీఓకు విఆర్‌ఏలు తమ ఆవేదనను తెలిపారు. జీతాలు బిల్లులు పెట్టాలంటే విఆర్‌ఓల వద్ద డ్యూటీ సర్టిఫికెట్ తీసుకోవాలని నిబంధనలు పెట్టారని విఆర్‌ఏలు ఆవేదన వ్యక్తం చేశారు. రేషన్ గోడౌన్ వద్ద విఆర్‌ఏలకు మాత్రమే డ్యూటీ వేస్తున్నారన్నారు. జీతాలు బిల్లులు పెట్టేందుకు విఆర్‌ఓల వద్ద డ్యూటీ సర్టిఫికెట్ అవసరం లేదని, ప్రతి నెల జీతాలు పెట్టాలని ఆర్డీఓ శ్రీనివాసులు తహశీల్దార్ వెంకటేశ్వర్లును ఆదేశించారు. జీతాలు పెట్టేందుకు డ్యూటీ సర్టిఫికెట్ నిబంధనలు లేవని ఆర్డీఓ అన్నారు.

కంటి లోపం ఉంటే జీవితం అంధకారమే

వేంపల్లె : కంటి లోపం ఉంటే జీవితం అధకారమేనని ఆప్తమాలజీ డాక్టర్ వై.యేసురత్నం అన్నారు. గురువారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో కంటి పరీక్షలను నిర్వహించారు. విద్యార్థులకు కంటి పరీక్షలను నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చెరసాల యోగాంజనేయులు, ఎన్ఎస్ఎస్ అధికారులు డాక్టర్ ఓబుల్‌రెడ్డి, డాక్టర్ మల్లేశ్వరమ్మ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మూఢనమ్మకాలపై తిరుగుబాటు చేయాలి

వేంపల్లె : రోజురోజుకూ పెరుగుతున్న మూఢ నమ్మకాలపై విద్యార్థులు తిరుగుబాటు చేయాలని జెవివి జిల్లా సమన్వయకర్త శ్రీరాములు అన్నారు. గురువారం స్థానిక జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మూఢ నమ్మకాలపై విద్యార్థులు సైంటిఫిక్ టెంపర్ అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సం దర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి శాస్త్రీయ దక్ప థాన్ని అలవర్చుకోవాలని కోరారు. సైన్స్ అభివద్ధికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో బాలి కల పాఠశాల హెచ్‌ఎం నారాయణమ్మ, జెవివి జిల్లా కార్యదర్శి చెరుకూరు శ్రీనివాసులు, ఉపాధ్యాయులు సునీత, సురేష్, వాసవి, బాబా ఫక్రుద్దీన్, ఉషారాణి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎంపీ చొరవతో రూ.5లక్షల పరిహారం

పులివెందుల రూరల్ : పులివెందుల మునిసిపాలిటీ పరిధిలో ఇటీవల కురిసిన వర్షాలకు విద్యుత్ స్తంభానికి కరెంట్ వచ్చి పెద్దక్క (చిరు వ్యాపారి) మృతి చెందిన విషయం విదితమే. బాధిత కుటుంబ సభ్యులు తమను ఆదుకోవాలని ఎంపీ అవినాష్‌రెడ్డిని కోరారు. అనంతరం వైఎస్సార్ బీమా ద్వారా రూ.5లక్షలు, విద్యుత్ అధికారులతో మాట్లాడి ప్రభుత్వం నుంచి మరో అయిదు లక్షల రూపాయలు ఎక్స్ గ్రేసియా ఇప్పించారు. ఆ మేరకు చెక్‌ను మునిసిపల్ ఇన్‌ఛార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి బాధిత కుటుంబానికి గురువారం అందజేశారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ వరప్రసాద్, హాల్ గంగాధర్‌రెడ్డి, పార్నపల్లి కిషోర్, వైసిపి నాయకులు గూడూరు గురు ప్రసాద్, బాబయ్య, కౌన్సిలర్ షాహిద పాల్గొన్నారు.

రాత్రివేళ బస్సులు రావడం హర్షణీయం : 'అచ్చుకట్ల'

ఖాజీపేట : ఖాజీపేట బస్టాండ్‌లోకి బస్సులు రాకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవారు. ఖాజీపేటలో బస్సు స్టాపింగ్ ఉన్నా బస్సులు వచ్చేవి కావు. దీనిపై పలుమార్లు ఆర్టీసీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా, మండల సర్వసభ్య సమావేశంలో సమస్యను ప్రస్తావించినా ఏ మాత్రం చర్యలు లేవు. ఈ పరిస్థితుల్లో ఇటీవల జరిగిన జిల్లా సర్వసభ్య సమావేశంలో జిల్లా పరిషత్ కో-ఆప్షన్ సభ్యులు అచ్చుకట్ల కరీముల్లా కలెక్టర్ విజయ్ రామరాజుకు సమస్యను వివరించారు. కలెక్టర్ స్పందిస్తూ ఆర్టీసీ ఉన్నతాధికారులకు ఆదేశాలు జారీ చేయడంతో నాలుగు సర్వీసులను బస్టాండ్‌లోకి వెళ్లేలా ఏర్పాటు చేశారు. మైదుకూరు డిపో అల్ట్రా పల్లెవెలుగు, జమ్మలమడుగు డిపో ఎక్స్‌ప్రెస్, సూపర్ లగ్జరీ, కడప-విజయవాడ సూపర్ లగ్జరీ బస్సు ఏర్పాటు చేశారు. బస్సు సర్వీస్ ఏర్పాటు పట్ల ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. జడ్పీకో-ఆప్షన్ మెంబర్ అచ్చుకట్ల కరీముల్లా చొరవ పట్ల మండల ప్రజలు అభినందిస్తూ సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



ఆర్‌ఎంపిల సమావేశంలో వైద్యాధికారి, సిబ్బంది

ఆర్‌ఎంపిలు నిబంధనలు పాటించాలి

ప్రజాశక్తి - చాపాడు

ఆర్‌ఎంపిలు ప్రభుత్వ నిబంధనలను తప్పక పాటించాలని చాపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ రాజేష్‌కుమార్ తెలిపారు. గురువారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆర్‌ఎంపి లకు వైద్య సేవలు, పాటించవలసిన నిబంధనలపై అవగాహన కల్పించారు. అనంతరం ప్రథమ చికిత్స కేంద్రాలను డాక్టర్ రాజేష్‌కుమార్, ఆరోగ్య విస్తరణ అధికారి యం.రాఘవయ్య, సూపర్‌వైజర్ సరస్వతితో కలిసి తనిఖీ చేశారు. ఇందులో ఒక ప్రాథమిక చికిత్స కేంద్రాన్ని సీజ్ చేశారు. మిగిలిన కేంద్రాల వారికి హెచ్చరికలు జారీ చేశారు. ప్రభుత్వ నిబంధనలు అతిక్రమించిన ప్రాథమిక చికిత్స కేంద్రాలను వెంటనే సీజ్ చేస్తామని తెలిపారు. బాలకార్మికులను సహాయకులుగా నియమించుకోకూడదన్నారు. పెద్ద ఆరోగ్య సమస్యలను వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి పంపాలని ఆయన సూచించారు. అనంతరం పెద్దచియ్యపాడులో ప్రాథమిక చికిత్స కేంద్రాన్ని తనిఖీ చేశారు. కార్యక్రమంలో కంటి వైద్యుడు తేజ, ఎంఎల్‌హెచ్‌పి రమేష్, ఎఎన్‌ఎంలు స్రవంతి, సునీత, గ్రేసమ్మ, ఆశా కార్యకర్తలు పెర్సీ, కుళ్లాయమ్మ, వసంత, రవణమ్మ, వరలక్ష్మి పాల్గొన్నారు.

రాయితీతో పివిసి పైపులు

ప్రజాశక్తి - సింహాద్రిపురం

ప్రభుత్వం రాయితీతో ఇస్తున్న పివిసి పైపులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారి శివమోహన్‌రెడ్డి తెలిపారు. గురువారం మండలంలోని అంకాలమ్మ గూడూరులో రాయితీ పైపులను రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలానికి సంబంధించి దాదాపు 500 యూనిట్లు రైతులకు ఇచ్చామన్నారు. పులివెందుల డెవలప్‌మెంట్ అథారిటీ కింద ఒక్కో యూనిట్‌కు రూ.10,000 చొప్పున రాయితీ ఇచ్చామన్నారు.

పశువుల పాకలు శుభ్రంగా ఉంచుకోవాలి

ప్రజాశక్తి - ముద్దనూరు

పశువులు దోమ కాటుకు గురికాకుండా వాటి పాకలను శుభ్రంగా ఉంచుకోవాలని మండల పశు వైద్యాధికారి వాసా శ్రీనివాస పాడి రైతులకు సూచించారు. మండలంలోని ఓబుళాపురం గ్రామంలో గురువారం శ్రీనివాస ఆధ్వర్యంలో ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశువుల కొట్టాలలో సాయంత్రం పూట వేపాకు పొగ పెట్టాలన్నారు. పశువుల పాకల చుట్టూ నీరు, మురికి, గంజరం నిల్వ లేకుండా శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. జమ్మలమడుగుకు చెందిన సిఎడిడిఎల్ వారు పశువుల నుండి రక్తం, ముక్కు, నోటి స్వాబ్స్ నమూనాలను సేకరించినట్లు తెలిపారు. నమూనాలను పరీక్షించి వ్యాధి నిర్ధారణ చేయనున్నట్లు తెలిపారు. పశువులకు అత్యవసర వైద్యసేవల కోసం 1962 టోల్ ఫ్రీ నెంబర్‌కు ఫోన్ చేస్తే రైతుల ఇంటి వద్దనే పశువులకు వైద్యం అందుతుందన్నారు. గ్రామంలో వ్యాధి బారిన పడిన ఆవులు, గేదెలు, దూడలకు వైద్యం చేసినట్లు ఆయన వివరించారు.

క్లాప్ డ్రైవర్లకు వేతనాలు చెల్లించాలి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు



ధర్నా చేస్తున్న క్లాప్ డ్రైవర్లు

సమాజంలోని చెత్తను దూరంగా పారవేసే క్లాప్ డ్రైవర్లకు బకాయి ఉన్న ఏడు నెలల వేతనాలను వెంటనే చెల్లించాలని సిఐటియు జిల్లా కార్యదర్శి సత్యనారాయణ, పట్టణ కార్యదర్శి విజయకుమార్ కోరారు. ఆమేరకు గురువారం క్లాప్ డ్రైవర్లు మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి, నినాదాలు చేశారు. అనంతరం మున్సిపల్ కమిషనర్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిఒ నెంబర్ 7 ప్రకారం రూ.18,500 ఇవ్వాలని ఈ విధానం క్లాప్ డ్రైవర్లకు కూడా వర్తింపజేయాలన్నారు. పిఎఫ్, ఇఎస్ఐ సక్రమంగా ఇవ్వాలన్నారు. రాబోయే కొద్ది రోజుల్లో క్రిస్మస్, జనవరి ఫస్ట్, సంక్రాంతి పండుగలు వస్తున్నాయని పండుగపూట పస్తులు గడపాల్సిన దుస్థితి నెల కొందన్నారు. సమస్యను గుర్తించి వెంటనే బకాయి వేతనాలను మంజూరు చేయాలని వారు కోరారు. క్లాప్ డ్రైవర్లకు మద్దతుగా మున్సిపల్ కార్మిక సంఘ నాయకులు చంటి, సాల్మన్, రమాదేవి, గుర్రమ్మ, ప్రమీలమ్మ, జాకోబు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల సారథి జగన్

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పట్టణంలోని చెన్నారెడ్డి కాలనీ సచివాలయం పరిధిలో మునిసిపల్ ఇన్‌ఛార్జి వైఎస్ మనోహర్ రెడ్డి ఆధ్వర్యంలో గురువారం గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. మునిసిపల్ చైర్మన్ వరప్రసాద్, హాల్ గంగాధర్‌రెడ్డి, వైస్ చైర్మన్ హఫీజ్, జేసిఎస్ కన్వీనర్ పార్నపల్లి కిషోర్, కౌన్సిలర్ షాహిద, సిద్దయ్య, రసూల్, చంద్రమౌళి, నిరంజన్, రామకృష్ణారెడ్డి, చంద్ర శేఖర్‌రెడ్డి, రఘు, బాషా, గంగిరెడ్డి, సచివాలయ కన్వీనర్లు నిరంజన్, సోమ అరుణ పాల్గొన్నారు.

కొండాపురం : సంక్షేమ పథకాల అమలులో సిఎం జగన్‌మోహన్‌రెడ్డిని మించిన వారు మరొకరులేరని టి.కోడూరు వైసిపి సీనియర్ నాయకుడు యన్. రామ సుబ్బారెడ్డి అన్నారు. కోడూరు గ్రామంలో గురువారం వైసిపి జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైసిపి యువ నాయకుడు విజయ భాస్కర్‌రెడ్డి, యం.మురళీధర్‌రెడ్డి, బి.యశ్వంత్‌రెడ్డి, పార్టీ అభిమానులు పాల్గొన్నారు.

శ్రీచైతన్య పాఠశాలలో ఫ్రూట్స్ డే

వేంపల్లె : స్థానిక శ్రీచైతన్య పాఠశాలలో గురువారం ఫ్రూట్స్ డేను ఘనంగా నిర్వహించారు. నర్సరీ, ఎల్ కెజి, యుకెజి చిన్నారులు అందరూ ఫ్రూట్స్ కలర్స్ దుస్తులతో అలంరించారు. రకరకాల కూరగాయలు, పండ్లు ప్రత్యక్షంగా ప్రదర్శించి వాటి ఉపయోగాలను చిన్నారులకు కరస్పాండెంట్ చక్రపాణిరెడ్డి వివరించారు. చిన్నారులు రకరకాల పండ్లుకు చెందిన చిత్రాలను చార్టులపై వేసి ప్రదర్శించారు. ప్రత్యేక అలకరణలో ఉన్న చిన్నారులను పాఠశాల డైరెక్టర్లు చేతన్‌రెడ్డి, చైతన్యరెడ్డి అభినందించారు.